క్లుప్తంగా

మొరాయించిన రైల్వేగేట్



పెనుకొండ రైల్వేగేటు దగ్గర స్తంభించిన ట్రాఫిక్

పెనుకొండ రూరల్: పట్టణ పరిధిలోని రైల్వేగేట్ మొరాయించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత రైలు వెళ్లేందుకు కీ మ్యాన్ గేట్ వేశాడు. అయితే రైలు వెళ్లిన తరువాత ఎంత ప్రయత్నించినా గేటును ఓపెన్ కాలేదు. దీంతో దాదాపుగా గంట సేపు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. కిలో మీటర్ వరకూ ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చేసేది లేక కొందరు వాహనదారులు మంగాపురం బ్రిడ్జి మీదగా రాకపోకలు సాగించారు.

న్యాయవాదిపై దౌర్జన్యం శోచనీయం

పావగడ: రాజానుకుంటె న్యాయవాదిపై పోలీసుల దౌర్జన్యం శోచనీయమని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషానందన్ అన్నారు. స్థానిక జేఎంఎఫ్‌సీ న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించి తాలూకా కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి ప్రభాకరరెడ్డి, రఘునందన్, ఈశ్వర్, అంబరీశ్, చన్నకేశవరెడ్డి, హనుమంతరాయప్ప తదితరులు తహసీల్దార్ వరదరాజుకు వినతి పత్రం అందించారు.

నిడుగల్ దుర్గం అభివృద్ధికి కృషి



డ్రమ్ము వాయించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న స్వామీజీ

పావగడ: 'తాలూకాలోని చారిత్రాత్మిక నిడుగల్ దుర్గం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి. పర్యాటక కేంద్రంగా గుర్తించి కోటలు, దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. నిడుగల్ ఉత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి' అని నిడుగల్ మహర్షి వాల్మీకి ఆశ్రమాధిపతి వాల్మీకి సంజయకుమార స్వామీజీ సూచించారు. స్థానిక నిడుగల్ దుర్గంలో మంగళవారం నిర్వహించిన నిడుగల్ దుర్గం ఉత్సవాల కార్యక్రమంలో స్వామీజీ మాట్లాడారు. ఉత్సవాల్లో జానపద కళా బృందాలు నిర్వహించిన జానపద కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు తాగునీటి సదుపాయం




గురుకుల పాఠశాలలో తాగునీటి ప్లాంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని నందమూరినగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఈఓ ఎంవీ రావు దృష్టికి సాహితీ గగన్ మహల్ సంస్థ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి తీసుకెళ్లారు. ఆయన సహకారంతో ప్రతీప్‌రెడ్డి వాటర్ ప్లాంట్‌ను స్కూల్‌లో ఏర్పాటు చేయించి ప్రారంభించారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ నూరుల్లా, రమణబాబు అధ్యాపకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

15 నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం

చిలమత్తూరు: మండల పరిధిలోని వీరాపురం పంచాయతీలో ఈనెల 15, 16 తేదీల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేష్ కృష్ణ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆజాద్

రొళ్ల: బాల్య వివాహాలను సంపూర్ణంగా నిర్మూలిద్దామని ఎంపీడీఓ ఆజాద్, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆవినకుంట కేజీబీవీ పాఠశాల ఆవరణలో ఎస్‌ఓ మున్వార్‌జాన్ అధ్యక్షతన ఐసీడీఎస్, ఆర్టీటీ, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, పోలీస్, రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలతో పాటు గుడ్‌టచ్–బ్యాడ్‌టచ్‌ను వివరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

సాక్షిబృందం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలుర, బాలికలకు లాంగ్‌జంప్, హైజంప్, పరుగు పోటీ, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు. ప్రతిభ కనబరచిన వారిని నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంలు, పీఈటీలు తెలిపారు.



పెనుకొండ: విద్యార్థుల పరుగు పందెం



చిలమత్తూరు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



మడకశిరరూరల్: కల్లుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు



పెనుకొండ రూరల్: గుట్టూరు ప్రభుత్వ పాఠశాలలో మైదానంలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థినులు



గోరంట్ల: బాలుర ఉన్నత పాఠశాలలో త్రోబాల్ విసురుతున్న విద్యార్థిని

సంక్షేమాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం

• వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. మంగళవారం హిందూపురం మున్సిపాల్టీ పరిధిలోని 10వ వార్డు లక్ష్మీపురంలో వార్డు కౌన్సిలర్ పార్వతీ అధ్యక్షతన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ లబ్ధిని వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హిందూపురంలో 30 ఏళ్లు పాలించిన టీడీపీ సరైన రోడ్లు, డ్రైనేజీలు కూడా వేయించలేకపోయారని సమన్వయకర్త దీపిక విమర్శించారు. తమ హయాంలో అభివృద్ధి చేశామని చెప్పుకోవడానికి వారు సిగ్గుపడాలన్నారు. ఇనాళ్లూ జరగని అభివృద్ధి ఈ నాలుగేళ్లలో దశలవారీగా జరుగుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వెనుకడుగు వేసే ప్రసక్తేలేదన్నారు. టీడీపీ నాయకుల మాటలను ఎవరూ నమ్మవద్దని ఎన్నికల సమయంలో తప్ప కంటికి కనపించని నాయకులకు ఓటుతో సరైన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇఇ వెంకటరమణ, డీఈ బాలసుబ్రమణ్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు ఆసీఫ్, శివ, గిరి, నాగేంద్రబాబు, చంద్ర, షాజియా, రహమత్‌బీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు శ్రీరాంరెడ్డి, నాయకులు నాగమణి, సాదిక్, మల్లికాభాను, రాంమూర్తి, భారతీ, ఇలియాజ్, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

ఆలయ అభివృద్ధికి విరాళం



రూ.లక్షన్నర చెక్కు అందిస్తున్న దాతలు

గోరంట్ల: మండల పరిధిలోని వానవోలు సమీపంలో వెలసిన కస్తూరి రంగనాథస్వామి ఆలయ అభివృద్ధికి కదిరికి చెందిన సబిత, నాగరాజు దంపతులు రూ.1,50,001 (లక్షా యాభై వేలా ఒక్క రూపాయి) విరాళంగా ఇచ్చారు. ఇందుకు సంబంధించిన చెక్కును మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజరి శ్రీధర్ మాట్లాడుతూ పురతన ఆలయ పునర్నిర్మాణానికి భక్తిభావంతో విరాళం ఇవ్వడం హర్షణీయమన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

మడకశిర: పట్టణంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో ఆరేపేటలో మట్కా రాస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. అతని వద్ద నుంచి మట్కా పట్టీలతో పాటు రూ.11,340 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పౌష్టికాహారం అందించండి

పెనుకొండ: పౌష్టికాహారం లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించాలని సీడీపీఓ శాంతలక్ష్మి సూచించారు. పట్టణంలోని సీడీపీఓ ప్రాజెక్ట్ కార్యాలయంలో మంగళవారం పెనుకొండ, రొద్దం అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ వారికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

పెనుకొండ రూరల్: మండలంలోని కొండంపల్లిలో ప్రవీణ్‌కుమార్ అనే యువకుడు క్రిమి సంహారక మందు సేవించి మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పాల డబ్బు విషయంలో తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై పొలంలో క్రిమి సంహారక మందు తాగాడు. అపస్మార కస్థితిలో పడివున్న ప్రవీణ్‌ను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి



ముస్లిం నాయకులతో సమావేశమైన వేణురెడ్డి

హిందూపురం: ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి వార్డుల వారీగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి ముస్లింలందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతి కోసమే హమారా వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. జగనన్న ముస్లింలకు చేస్తున్న మంచిని అందరికీ వివరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా, మాజీ ముత్తవల్లి ఖలీముల్లా, అజిత్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



అమరాపురం: కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అమరాపురం: మండలంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి, కోట వీధిలోని చౌళమాంబదేవి, హేమావతిలోని మారెమ్మదేవి ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

లేపాక్షి: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో వెలసిన ముత్యాలమ్మ దేవాలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డు వేయించానని చెప్పడం హాస్యాస్పదం



రోడ్డు కోసం హైవేపై ఆందోళన చేస్తున్న గలిబిపల్లి గ్రామస్తులు (ఫైల్)



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మూడు నెలల క్రితం పూర్తయిన రోడ్డు

• 8 ఏళ్లు ఏమైపోయావు ఎమ్మెల్యే బాలయ్యా?
• గలిబిపల్లి సర్పంచ్ ఆదినారాయణ

హిందూపురం: లేపాక్షి మండలం గలిబిపల్లి గ్రామానికి 2 కిలో మీటర్ల బీటీ రోడ్డు వేయించానని ఎమ్మెల్యే బాలకృష్ణ మంగళగిరిలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చెప్పడం హాస్యాస్పదంగా ఉందని గలిబిపల్లి సర్పంచ్ ఆదినారాయణ అన్నారు. ఎమ్మెల్యేగా బాలకృష్ణ 8 ఏళ్ల కిందట రోడ్డు పనులకు భూమి పూజ చేసి పనులు చేయడం మరిచిపోయారని విమర్శించారు. పనులు మొదలు పెట్టాలని గ్రామస్తులతో కలిసి పలుసార్లు మొరపెట్టినా ఫలితం లేకపోయిందన్నారు. ఎమ్మెల్యే ప్రతిపాదించిన రోడ్డు పనికి నిధులు ప్రతిపాదినలకే సరిపోయాయని తెలిపారు. పనుల కోసం రోడ్డెక్కి ధర్నాలు చేశామని, చివరగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు అయ్యాయని స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యులు కనకమెడల రవీంద్ర ద్వారా రూ.35 లక్షలు నిధులు మంజూరయ్యాయని, అయినా ఆ నిధులతో పనులు పూర్తి కావని అధికారులు పనులు మొదలు పెట్టలేదన్నారు. దీంతో రోడ్డు కోసం గ్రామస్తులతో కలిసి మళ్లీ ధర్నాలు చేశామని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో రూ.6 లక్షలు మంజూరు చేస్తే మూడునెలల కిందట బీటీ రోడ్డు పనులు చేశారన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గానికి రావడమే కష్టమని, గ్రామానికి రోడ్డు వేయించానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

పోలింగ్ స్టేషన్లను హేతుబద్ధీకరిస్తాం

• సబ్ కలెక్టర్ కార్తీక్

పెనుకొండ: 1500 మంది ఓటర్లు దాటిన ప్రతి పోలింగ్‌స్టేషన్‌ను హేతుబద్ధీకరిస్తామని సబ్‌కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆయన పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ 1500 ఓటర్లు దాటిన స్టేసన్‌లను హేతుబద్ధీకరిస్తామని, గతంలో ఏవైనా పోలింగ్‌స్టేషన్‌లు పాతభవనాల్లో ఉంటే ఏఈఆర్‌ఓలు పోలింగ్‌స్టేషన్లను సందర్శించి అందుబాటులో కొత్త భవనాల్లోకి మార్చేలా సిఫార్సు చేయాలని సూచించారు. రెండు, మూడు రోజుల్లో ఆ అంశంపై మరోసారి సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇందులో ఏవైనా లోటుపాట్లు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రమణ, హనుమంతు, షాషావలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

లేపాక్షి/గుడిబండ/రొళ్ల/అగళి/గోరంట్ల: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ, ఎంఈఓ, వైద్యాధికారులు పేర్కొన్నారు. లేపాక్షి, గుడిబండ, రొళ్ల, అగళి, గోరంట్ల మండల కేంద్రాల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. వైద్య సిబ్బంది ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రజలకు అవసరమైన మందులను ఉచితంగా అందజేయాలని సూచించారు.



గోరంట్ల: జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పెనుకొండ: వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరని ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. వినాయక చవితి వేడుకల్లో కీలకమైన మంటపాలు, పందిళ్ల ఏర్పాటుకు 5 మంది అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలతో పోలీస్‌స్టేషన్‌లో అనుమతి పొందాలన్నారు. అలాగే ఫైర్, విద్యుత్‌శాఖ అనుమతి పొందాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గుడిబండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ (గణితం) పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు ఎమ్మెస్సీలో 50 శాతం మార్కులతో ఉత్తర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మిగతా వివరాలకు 9553610347, 9000891213 ఫోన్ నంబర్‌లను సంప్రదించాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం

గుడిబండ: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఎంఈఓ రవిచంద్రకుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు.

కర్ణాటక మద్యం రాకుండా చర్యలు

హిందూపురం అర్బన్: కర్ణాటక మద్యం మన రాష్ట్రంలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. ఇసుక అక్రమ రవాణా, రెడ్ శాండిల్, గ్యాంబ్లింగ్, మట్కా, పేకాటలపై ప్రత్యేక నిఘా ఉంచి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి' అని సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్) డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య పేర్కొన్నారు. హిందూపురం సెబ్ స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. రాష్ట్ర సరిహద్దులో మద్యం నియంత్రణ, ఇతర కార్యకలాపాలపై హిందూపురం, మడకశిర, పెనుకొండ, సీకే పల్లి, తనకల్లు, కొడికొండ , తూమకుంట చెక్‌పోస్ట్ సీఐలు, ఎస్‌ఐలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం కొడికొండ, తూమకుంట సెబ్ చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. సమీక్షలో సెబ్ సీఐలు, ఎస్ఐలు స్వర్ణలత, సుబ్బారెడ్డి, భార్గవ్‌రెడ్డి, ఉమాబాయ్, సైదుల్, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.



సెబ్ అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య

పనులు వేగవంతం చేయండి



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: మండల వ్యాప్తంగా నాడు–నేడు రెండో దశ కింద మంజూరైన పనులను కాంట్రాక్టర్లు వేగవంతం చేయాలని ఎంఈఓ–2 శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని హొట్టేబెట్ట ఉన్నత పాఠశాల ఆవరణలో నాడు–నేడు రెండో దశ కింద చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. తొలుత కేపీ తండా, హొట్టేబెట్ట ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలలో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.

వాహనాల సీజ్



ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేసిన దృశ్యం

సోమందేపల్లి: మండలంలోని కేతగాని చెరువు గ్రామ సమీపంలో ఉన్న చెరువులో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు లోకేంద్ర, ఆంజినేయులు, మల్లయ్య గత కొద్దిరోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు ఇరిగేషన్ డీఇ లక్ష్మీనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఏఎస్ఐ మురళి సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లు, జేసీబీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ హయాంలో ప్రతి పథకంలోనూ అవినీతి



మాట్లాడుతున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా పని చేస్తోందని ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు పీఆర్.మూర్తి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో ప్రతి పథకంలోనూ అవినీతి జరిగిందన్నారు. అమరాపురం మండలంలో నీరు – చెట్టు కింద నిధులు స్వాహా చేశారని విమర్శించారు. గత ప్రభుత్వ హయంలో పెట్టిన మొక్కలు ఎక్కడా కనిపించడం లేదన్నారు. అవినీతి చేశారు కాబట్టే ప్రస్తుతం టీడీపీ అధినేత చంద్రబాబు ఊచలు లెక్కపెడుతున్నారన్నారు. రాజకీయ దురుద్దేశంతో అరెస్ట్ చేశారని టీడీపీ నాయకులు ఆరోపించడం తగదన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని జగనన్న అందిస్తున్న సుపరిపాలనను అభినందించాలని హితవు పలికారు.

కొల్హాపురి మహాలక్ష్మికి పూజలు



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, తులసీ పూజ చేశారు. తర్వాత అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళారతి ఇచ్చారు. ప్రత్యేక పూజ రోజు కావడంతో గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతాల నుంచి అమ్మవారిని కొలిచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. దాతల సహకారంతో అన్నదానం చేశారు.